క్లుప్తంగా

కార్యాలయం నిర్మాణ పనులు పూర్తి చేయాలి

మరికల్: మండలంలోని మాధవరంలో అర్థాంతరంగా నిలిచిపోయిన పంచాయతీ భవనం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు యాదయ్య, వెంకటయ్య, నర్సింములు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం భవనాలకు నిధులు మంజూరు చేసిందని, కొన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి కూడా తెచ్చారన్నారు. మాధవరంలో పనులు ఆగిపోవడంతో చిన్న గదిలో కార్యాలయం కొనసాగించాల్సి వస్తుందన్నారు. అధికారులు వెంటనే భవనం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



మరికల్: కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి డాక్టర్ గాంధీ తన వంతుగా బుధవారం రూ.10,116 అందజేశారు. అలాగే మల్లేశ్ రూ.2116, రఘు రూ.2116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ పున:నిర్మాణానికి సాయమందించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాన్ని త్వరగా పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేపడతామని ఆలయ కమిటీ ప్రధాన కర్త జోగు మల్లయ్య తెలిపారు.

వనమహోత్సవానికి సిద్ధం కావాలి



కొత్తపల్లి: వనమహోత్సవంలో భాగంగా నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కృష్ణారావ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పెద్దాపూర్ నర్సరీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏ ఏ ప్రదేశాల్లో ఎలాంటి మొక్కలు నాటాలో అంచనాకు రావాలని సూచించారు.అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేశారు. అలాగే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలి

మాగనూర్: మాగనూర్ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని మండల బీజేపీ నాయకులు కోరారు. ఇటీవల ఆయన మాగనూర్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించడంతో బుధవారం ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్యామలమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలుచేసి అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్‌గౌడ్, నల్లె నర్సప్ప, రాంగోపాల్‌శెట్టి, అంజనేయులుగౌడ్, భీంరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి బోనాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని కిషన్ నగర్‌లో కొలువైన మల్లలమ్మ దేవి బోనాలు బుదవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు కుర్మన్న, గోవిందు, కుర్మంతి, కురుక్షేత్రం, కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

కోస్గి రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన పట్టణ శివారులో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మద్దూర్ మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, విజయ్‌కాంత్ ఇద్దరు బైక్‌పై కొడంగల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పట్టణ శివారుకు రాగానే కొడంగల్ నుంచి కోస్గికి వస్తున్న మరో ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, విజయ్‌కాంత్‌కు తీవ్రగాయాలు కావడంతో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పాలమూరు జిల్లా కేంద్రానికి తరలించారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇక సెల్‌ఫోన్‌కు నో ఎంట్రీ

- తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఫోన్ మాట్లాడకూడదు
- స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని నిర్ణయం



తరగతి గదిలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇకపై తరగతి గదిలో సెల్‌ఫోన్ మాట్లాడటం నిషేధం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల కితం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తరగతి గదిలో ఉన్న సమయంలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌లో మాట్లాడితే చర్యలు తప్పవని అందులో పేర్కొంది. రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఫోన్లు వినియోగిస్తున్నారనే సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఉపాధ్యాయులు తరగతి గదిలో ఫోన్‌లో మాట్లాడటం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని నిపుణులు సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ సెల్‌ఫోన్ వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని సూచించింది.

సమయం వృథా కాకుండా..

తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ మాట్లాడటం ద్వారా సమయం వృథా అవడంతో పాటు విద్యార్థుల్లో ఏకాగ్రత దెబ్బతింటుందని చెబుతున్నారు. అంతేకాక ఫోన్‌లో మాట్లాడగానే అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు వెంటనే పాఠ్యాంశంలో నిమగ్నం కావడం సాధ్యం కాదనే నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో విద్యావేత్తల నుంచి అందిన సమాచారంతో ప్రభుత్వం ఇకపై తరగతి గదుల్లో ఫోన్ మాట్లాడకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయులు తరగతి గదిలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పాఠశాలలకు రాగానే స్టాఫ్‌రూమ్‌లో పెట్టడం అలాగే విరామ సమయంలో మాత్రమే ఫోన్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

ప్రభుత్వ నిర్ణయం మంచిదే



ప్రభుత్వ ఉపాధ్యాయులు పనివేళల్లో సెల్‌ఫోన్ వినియోగించకుండా నిర్ణయం తీసుకోవడం మంచిదే.తద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు బోధనకు పూర్తి సమయాన్ని కేటాయించొచ్చు. విద్యార్థులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవడం హర్షనీయం.

– రాజేందర్‌రావు, ఉపాధ్యాయుడు

ప్రధానోపాధ్యాయులకు సూచించాం



ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా చర్యలు తీసుకుంటాం. పాఠాలు బోధించే సమయంలో ఫోన్ మాట్లాడినట్లు తెలితే చర్యలు తీసుకునేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించాం. స్కూల్‌కు ఫోన్ తీసుకొచ్చిన వెంటనే హెచ్‌ఎంకు అప్పగించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం.

– శంకర్‌నాయక్, ఎంఈఓ, కోస్గి

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మక్తల్: నారాయణపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు బీంషేన్‌రావు భార్య నాగమణి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి బుధవారం బీంషేన్‌రావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీంషేన్‌రావుతో పాటు ఇద్దరు కుమారులను ఓదార్చి సానుభూతి తెలియజేశారు. ఈయన వెంట మక్తల్ మాజీ ఎమ్మెల్యే నర్సింహగౌడ్, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గందె రవికాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



కోస్గి: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వాడాలని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధ వారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో తడి–పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. అలాగే అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, వెంకటయ్య, అంజనేయులు, పుల్లప్ప, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రైతు కూలీ, కార్మికుల సభ్యత్వ నమోదు

మద్దూరు: అఖిల భారత ఐక్య రైతు, కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం నాయకులు బుధవారం అప్పిరెడ్డిపల్లిలో చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజు రూ. 600 కూలి చెల్లించాలని, రైతులకు అన్ని రకాల పనిముట్లు సబ్సిడీపై అందజేసి అందుబాటులో ఎరువులు, విత్తనాలు ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొండా నర్సిములు, కృష్ణయ్య, వెంకటప్ప పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన

దామరగిద్ద: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మొగుల్‌మడ్క శక్తి కేంద్రంలో మోదీ 11 ఏళ్ల పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, అంజిలయ్యగౌడ్, సాయిలు, పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ సేవాలను జిల్లాలోని ప్రతి గ్రామంలో విస్తరించేందుకు క్లబ్ సభ్యులు కృషి చేయాలని లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మహేందర్ కుమార్ రెడ్డి వైస్ డిస్టిక్ గవర్నర్ సురేష్ జిజ్ఞాని అన్నారు. బుధవారం కర్ణాటక రాయచూరు జిల్లా కేంద్రంలో రీజన్లోని లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశంలో జిల్లాకు చెందిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సరిత హరినారాయణ్ బట్టడ్, కార్యదర్శిగా సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా రవికుమార్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

‘ఉపాధి’ పనుల్లో వేగం పెంచాలి



మద్దూరులోని ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిసెంట్లతో మాట్లాడుతున్న అధికారులు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ నాగరాజులు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు మండలాలకు కలిపి రూ.లక్ష విలువతో పశువుల షెడ్ల నిర్మాణం 80 యూనిట్లు, మేకల గొర్రెల షెడ్లు 40, 25 వేల న్యాపాడ్ (ఎరువుల తొట్టి) 20 యూనిట్లు, దేశీ కోళ్ల షెడ్లు రూ.లక్ష విలువ చేసేవి 20 యూనిట్లు, 110 ఎకరాల్లో మామిడి తోటల పెంపకం, తదితర యునిట్లు ఉన్నాయని అర్హులైన వారిని గుర్తించి నిర్మించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి మద్దూరు మండల ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్

కోస్గి రూరల్: జాతీయ ఆహర భద్రత మిషన్‌లో భాగంగా మండలంలోని రైతులకు వంద శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో పలువురు రైతులకు సబ్సిడీపై పీఆర్‌జీ–176 , ఎల్ఆర్‌జీ–52 రకం కంది విత్తన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆహర ఉత్పాదకతను పెంచడం, పంటల దిగుబడిని మెరుగుపరచడం, ఆహర భద్రతను సాధించడమే లక్ష్యమన్నారు. అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతు రుణమాఫీ లబ్ధిదారుల జాబితా బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణ , మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ఏఈఓలు వినోద్, అజయ్ పాల్గొన్నారు.

జూలై 9న సమ్మెను విజయవంతం చేద్దాం

నారాయణపేట: దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయా లని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయచంద్రమోహన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, కార్మికులు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని,ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మక్తల్: కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గోవిందురాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మక్తల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సరోజిని మట్టకు బుధవారం వినతి పత్రం అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు సంబంధించి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దీనిని కార్మికులందరూ కలిసి అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, శ్రీలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ద్యావరింటి నర్సింహారెడ్డి

మక్తల్: ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు చెల్లించాలని నారాయణ పేట జిల్లా భారతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ద్యావరింటి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఒకసారి రైతుల అకౌంట్లో డబ్బులు చేసి రైతు సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు రుణమాఫీ 50 శాతం కూడా పూర్తి కాలేదని వంద శాతం పూర్తి అయిందని డబ్బాలు కొట్టుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మద్దతు ధరకి సంబంధించిన డబ్బులు మాత్రమే వేసి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తామని చెప్పిన బోనస్ రూ.500 నేటి వరకు రైతులకు జమ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం ఆపి వెంటనే బోనస్ డబ్బులు వేయాలని కోరారు. జమ చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, స్వాగత్ సత్యనారాయణ, లక్ష్మిపతి పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాలని వినతి



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ చక్రపాణిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని ముడుమాల్ దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీపీఓ జాన్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఆగస్టులో దళిత యువకుడు ఓబులేష్ వివాహ విషయంలో చక్రపాణి బాధితుడిని అవమానించారు. అప్పట్లో ఈ విషయమై దళిత సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆరు నెలలు సస్పెండ్ చేసి తరువాత మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. ఈ కేసు విషయమై డీపీఓ జాన్‌సుధాకర్ విచారణ నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయానికి రాగా విధుల నుంచి తొలగించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

బాధ్యతాయుత సేవలతోనే గుర్తింపు



ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డికి నగదు బహుమతి అందజేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

మక్తల్: పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. బుధవారం మక్తల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, సిబ్బంది అశోక్, శ్రీకాంత్, శశిధర్‌గౌడ్‌కు ఎస్పీ రివార్డులు అందజేసి అభినందించారు. ఇటీవల దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను త్వరితగతిన పట్టుకొని జైలుకు పంపినందుకు రివార్డు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇలాగే బాధ్యతో పని చేయాలని అప్పుడే తమకు గౌరవం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, మహేష్, సీఐలు రాంలాల్, రాజేందర్ పాల్గొన్నారు.

‘ఓట్ల కోసమే రైతు భరోసా పంపిణీ’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి రూరల్: బీఆర్ఎస్ హయాంలో రైతులకు నాట్ల కోసం రైతు భరోసా అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం రైతు భరోసా వేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మూడు విడతలకు సంబంధించి రూ.27 వేల కోట్లు రైతులకు ఇవ్వకుండా ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం 9 రోజుల్లో రూ.9వేల కోట్లు పంపిణీ చేశారన్నారు. పింఛన్ల పెంపు, తులం బంగారం , రుణమాఫీ , మహిళలకు రూ.2500 ఏమైందని మండిపడ్డారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నరన్నారు. అనంతరం ఈ నెల 29న సాయిచంద్ వర్ధంతి సందర్భంగా సాయిచంద్ విగ్రహ ప్రతిష్టాపన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ సాయిలు, జనార్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మధుయాదవ్, వెంకట్‌నర్సింములు, సాయిలు , ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



ఊట్కూరు బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉమాపతి

ఊట్కూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల ప్రత్యేకధికారి ఉమాపతి కోరారు. బుధవారం ఊ ట్కూరులోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని, స్వచ్ఛమైన తాగునీరును అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ప్రధానోపాధ్యాయులు సుమ, ఫజల్, అశోక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతు న్న విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని మాగనూర్ ఎంఈవో మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వడ్వాట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆంగ్లంపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న వడ్వాట్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

నర్వ: ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని క్లస్టర్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మీ సూచించారు. బుధవారం పెద్దకడ్మూర్ క్లస్టర్ పరిధిలోని బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు చదవడం, రాయడం బాగా నేర్పించాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు.

ఘనంగా అమావాస్య పూజలు



ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల పూజలు

నారాయణపేట రూరల్ : కాళబెళగుండె బసవేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియామవాళి, శాస్విత రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, అలంకరణ చేపట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధన్వాడ: అమవాస్య సందర్భంగా బుధవారం ధన్వాడ మండల కేంద్రంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయం, బురుజుగడ్డ ఆంజనేయస్వామి దేవాయలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాలు చేశారు. అమావాస్య కావడంతో స్వామి వారికి ఆకులపూజ, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్వ, పెద్దకడ్మూర్ శివాలయాల్లో తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాభిషేకాలు, బిల్వార్చన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామి వారి చిత్రపటంతో పల్లకిసేవా నిర్వహించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలి

దామరగిద్ద: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలని బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, పేట జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌చందర్‌రెడ్డి అన్నారు. బుధవారం అమావాస్య సందర్భంగా మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో మట్టి ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండేలా చూడాలని స్వామిని ప్రార్థించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుభాష్, శరణయ్యస్వామి, మల్లికార్జున్, రాజు నాగార్జున హరీష్‌లు పాల్గొన్నారు.

అర్చకుల బకాయి వేతనాలు చెల్లించాలి



దామరగిద్ద: అర్చకులకు దూపదీప నైవేద్యం కింద చెల్లించాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని దూప దీప నైవేద్య సంఘం జిల్లా జ్ఞానేశ్వర్ అధ్యక్షుడు తిప్పయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు అర్చకుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన గుడి బాట కార్యక్రమ పోస్టర్‌ను జాతీయ జిల్లా కార్యదర్శి చామాచార్యులు, మండల అధ్యక్షుడితో కలిసి బుధవారం విడుదల చేశారు. తమకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, హెల్త్ కార్డులు అందించాలని కోరారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట యోధులకు సన్మానం

నారాయణపేట రూరల్: నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో విధించిన ఎమర్జెన్సీకి బుధవారానికి యాభై ఏళ్లు పూర్తి కావడంతో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసి జైలు జీవితం గడిపిన పోరాట యోధులకు బుధవారం నారాయణపేటలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్యయాదవ్ గెస్ట్ హౌస్‌లో జి.కుర్మన్న, కుంటి ఎల్లప్ప, జి.నింగిరెడ్డి,నాగు రావు నామాజీ, రమేష్, నర్సింహులను ఘనంగా సన్మానించి వారి అనుభవాలను తెలుసుకున్నారు.

ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులపై ఫిర్యాదు

ధన్వాడ: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు ఎంఈఓ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నపిల్లలను తల్లితండ్రులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు బలవంతంగా పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారని పేర్కొన్నారు.ఎంఈఓ స్పందించి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. ఇందులో రాణి, శారదా, భూదేవి, శాంత, సంతోష, శ్రీలక్ష్మి, సావిత్రమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట రూరల్: మండలంలోని చిన్న జట్రం 33/11 ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు రూరల్ ఏఈ సాయినాథ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.